క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అవోపా మహిళా విభాగ్ ప్రతినిధులు

కడప కల్చరల్: ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెసనల్స్ అసోసియేషన్(అవోపా) మహిళా విభాగ్ ప్రతినిధులు కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షురాలు సాధు కృష్ణవేణి మాట్లాడుతూ తమ సంస్థ ఉపాధ్యక్షురాలు మధులత తమ వంతుగా పేదలను ఆదుకునేందుకు ముందుకురావడం సంతోషదాయకమన్నారు. అనంతరం సంస్థ స్టేట్ అడ్వైజర్ శ్రీ ముచర్ల వెంకట సుబ్బయ్య మునగా మధులతను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల సత్య ప్రసాద్, రెడ్డి లక్ష్మి, కల్పనాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



హెడ్ మాస్టర్ జోజిరెడ్డి, ఉపాధ్యాయులతో పాటు పూర్వ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: 1977 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మరియాపురం పాఠశాలలో గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పాఠశాలలో 1977లో చదివిన పూర్వ విద్యార్థులంతా కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని పులకించిపోయారు. నాడు చదువుకునే రోజుల్లో చేసిన చిలిపి పనులను గుర్తుచేసుకుని ఆనంద పరవశంలో మునిగిపోయారు. అనంతరం హెడ్‌మాస్టర్ జోజిరెడ్డితోపాటు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలకోసారి సమావేశం నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలపై మూడు నెలలకోసారి కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సివి.ప్రసాద్, కడప జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర ,అలీఖాన్ కోరారు. విలేకరులతో వారు మాట్లాడుతూ సమావేశాలు నిర్వహిస్తే విద్యా శాఖ ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగుతుంది, ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం కలుగుతుందని తెలిపారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సమావేశం నిర్వహించాలని, ఫోర్టో, ఫ్యాప్టో, బాక్టోలను ఆహ్వానించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

కడప అర్బన్: మెంటా రామలక్ష్మమ్మ 2వ వర్ధంతి సందర్భంగా కుమార్తె రుక్మిణి నాగరాజు మనువరాలు లక్ష్మీశ్రీనివాస్ కలిసి నిరాశ్రయులకు అన్నదానం చేశారు. హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గుండ్లకొండ రవి, పుట్టా పురుషోత్తం, రెడ్డి లక్ష్మణ్, వెంకటసురేష్‌బాబు, అరుణ కుమారి, మధు, గుండ్లకొండ శ్రీచరణ్, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి



కమలాపురంలో గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులురెడ్డి

కమలాపురం : జనవరి 4, 5 తేదీలలో కడపలో జరగనున్న సీపీఐ(ఎం) మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కామనూరు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. కమలాపురం మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆదివారం సీపీఎం జిల్లా మహాసభల గోడపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహాసభ సందర్భంగా జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన టీడీపీ నాయకత్వంలోని ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు. ఇటువంటి పరిస్థితుల్లో మన రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని ధైర్యంగా ఎండగడుతూ తమ పార్టీ ప్రజల్ని చైతన్యవంతం చేస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, అమరావతి రాజధాని నిర్మాణం, కరువు సమస్య, విద్యుత్ చార్జీలు, పన్నుల భారం, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న ప్రజల అన్ని సమస్యలమీద పోరాటం చేస్తూ వాటి పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను సీపీఎం ముందుకు తెచ్చిందన్నారు. రాష్ట్రంలో తిరుమల లడ్డుపై మతవిద్వేష రాజకీయం చేస్తూ సమాజంలో సహృద్భావ వాతావరణాన్ని విషపూరితంగా మార్చడానికి జరుగుతున్న కుట్రలను నిలువరించడానికి ప్రజలను సీపీఎం జాగ్రతుల్ని చేస్తోందన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

కదిలెను యువత.. తెలిసెను చరిత

వైఎస్సార్ కడప జిల్లా పరిధిలోని సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడంతోపాటు ఇక్కడి ప్రాంత ప్రత్యేకత, విశిష్టత తెలుసుకునేందుకు యువత ఆసక్తి కనబరుస్తోంది. ఇందులో భాగంగానే వారసత్వ కట్టడాలు, వివిధ మతాలకు చెందిన ఆలయాలను విశాఖపట్నం జిల్లాకు చెందిన యువత సందర్శిస్తోంది. యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం పేరుతో విశాఖ యువత విచ్చేయగా వారిని సాక్షి పలుకరించింది. ఈ సందర్భంగా జిల్లాలో అద్భుతమైన కట్టడాలు, సంప్రదాయాలపై వారి అభిప్రాయాలను తెలియజేశారు.

- యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంతో యాత్రలు
- జిల్లాలో పర్యటిస్తున్న విశాఖ యువత
- జిల్లా సంస్కృతి, సంప్రదాయాలపై అధ్యయనం



గండికోటను సందర్శించిన విశాఖపట్నం జిల్లా యువతీ, యువకులు

వైవీయూ: విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, ప్రసిద్ధ ప్రాంతాలన్నీ చూడటం వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. పేదరికంతో ఎందరో యువత వాటికి దూరమవుతున్నారు. ఇది గుర్తించిన భారత యువజన సర్వీసులశాఖ యువతకు సమాజంపై అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఇతర ప్రాంతాలను సందర్శించే అరుదైన అవకాశం కల్పించింది. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ×యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం¥ కింద వివిధ జిల్లాల యాత్రలకు శ్రీకారం చుట్టింది. ఒక్కో జిల్లాలో సుమారు పది యాత్రలకు అనుమతిస్తున్నారు. వెసులుబాటును బట్టి ఒక్కో యాత్రకు 50 నుంచి 100 మందిని ఎంపిక చేస్తున్నారు. ఈ యాత్రలతో వృత్తి, వ్యక్తిగత నైపుణ్యాలను యువత పెంపొందించుకునే వీలుంటుంది. క్షేత్ర పర్యటనలు విద్యార్థుల మానసికోల్లాసం, విషయ పరిజ్ఞానం సాధించేందుకు ఇవి దోహదం చేస్తాయని అధ్యాపకులు చెబుతున్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరాల ద్వారా విద్యార్థులను సామాజిక సేవలో భాగస్వాములను చేస్తున్నారు. సరైన మార్గనిర్దేశనం లేకపోవడం, స్థానికేతర విషయాలపై అవగాహన లేమి, యువతలో కొరవడుతోంది.

అవకాశాలు అందిపుచ్చుకొనేలా..

విద్యాభ్యాసం ముగింపు దశలో విద్యార్థులతోపాటు నిరుద్యోగ యువతకు నిర్దిష్టమైన ప్రణాళిక, సరైన అవగాహన లేకపోవడంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోలేక పోతున్నారు. దీన్ని అధిగమించడం కోసం చేపట్టిన యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం యువతలో ఆలోచన పరిధి విస్తరించడానికి ఉపయోగపడుతోంది. జీవితంలో స్థిరపడేందుకు వీలుగా ఉపాధి, ఉద్యోగాన్వేషణకు యాత్రల ద్వారా అవకాశం కల్పిస్తోంది. ఈ కార్యక్రమంలో పాల్గొనే యువతకు రవాణా ఖర్చులు, అనుమతులు, వసతి, ఇతరత్రా సౌకర్యాలను ప్రభుత్వమే సమకూరుస్తుంది. పారిశ్రామికవాడలు, శాస్త్రసాంకేతిక పరమైన ప్రదేశాలు, అన్ని మతాలకు సంబంధించిన, విభిన్న సంస్కృతులు గల సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, ప్రకృతి వనరులు, సహజసిద్ధంగా ఏర్పడిన ప్రదేశాలు, వారసత్వ కట్టడాలను సందర్శించే వెసులుబాటు కల్పిస్తోంది. తద్వారా పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశం ఉంది. ఎక్కువ మంది యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యం.

జిల్లాలో పర్యటనలు ఇలా..

యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాకు విచ్చేసిన విశాఖ జిల్లా యువత ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జిల్లాలో పర్యటించింది. వైఎస్ఆర్ కడప జిల్లా యువత జనవరి 2 నుంచి 6వ తేదీ వరకు విశాఖ జిల్లాలో పర్యటించనుంది. కాగా జిల్లా పర్యటనకు విచ్చేసిన విశాఖ యువత యోగివేమన విశ్వవిద్యాలయం, ఒంటిమిట్ట శ్రీకోదండరామాలయం, సిద్ధవటం కోట, కడప అమీన్‌పీర్ దర్గా, శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం, గండికోట, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ తదితర ప్రదేశాలను పరిశీలించారు.

అద్భుతమైన కట్టడాలను దర్శించుకున్నా



వైఎస్సార్ కడప జిల్లాలో ఎంతో అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయి. మేము ఊహించుకున్న దాని కంటే చాలా గొప్ప కట్టడాలు ఉన్నాయి. వీటన్నింటినీ సందర్శించే అవకాశం యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం ద్వారా లభించడం సంతోషంగా ఉంది.

– రాజశేఖర్, డిగ్రీ తృతీయ సంవత్సరం, విశాఖపట్నం

మరిచిపోలేని విధంగా యాత్ర



యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహిస్తున్న యాత్ర ఉత్సాహంగా సాగుతోంది. గండికోట, ఒంటిమిట్ట, సిద్ధవటం ప్రాంతాలను చూసినప్పుడు మాకు ఈ యాత్ర ఎంత విలువైనదో అర్థమైంది. మా జీవితంలో మరిచిపోలేని విధంగా ఈ యాత్ర ఉంది.

– డి. కావ్య, డిగ్రీ ద్వితీయ సంవత్సరం, భీమిలి

సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం



రాయలసీమ ప్రాంత ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం ఈ యాత్ర ద్వారా లభించింది. ఇక్కడి ప్రాంతంలోని ప్రత్యేకత, చేతివృత్తుల పనులు, కర్మాగారాలు, ఆలయాలు, వారసత్వ కట్టడాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం లభించడం మా అదృష్టం.

– బి. దివ్య, డిగ్రీ తృతీయ సంవత్సరం, అరకు

జనవరి 4న బ్రెయిలీ జయంతి

కడప ఎడ్యుకేషన్: కడప అంధుల ఉన్నత పాఠశాలలో 2025, జనవరి 4వతేదీన బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ కడప సబ్ బ్రాంచ్ ప్రెసిడెంట్ ప్రశాంతి తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన అంధ ఉద్యోగులు, బ్యాంకు సిబ్బందికి జనవరి 3, 4, 5వ తేదీలలో మూడు రోజులపాటు ఓడీ సౌకర్యం ఉంటుందని తెలిపారు. హాజరయ్యే వారికి ఉచిత భోజనం, ఆర్టీసీ బస్సుపాసులు ఇప్పిస్తామని తెలిపారు. వివరాలకు 9440994892, 9000108946 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

జనవరి 22న శోభాయాత్ర



మాట్లాడుతున్న దేశు వెంకటరెడ్డి

కడప కల్చరల్: కడప నగరంలో 2025 జనవరి, 22న శ్రీరామ మహా శోభాయాత్ర నిర్వహించాలని ధార్మిక వేత్తలు నిర్ణయించారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని కోదండ రామాలయంలో ఆలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ధార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ గత ఏడాది జనవరిలో అయోధ్య రామమందిర నిర్మాణాన్ని పురస్కరించుకుని నగరంలో భారీ ర్యాలీ నిర్వహించామని గుర్తుచేశారు. ఈ ఏడాది జనవరి 22న ఉదయం సీతారాముల కల్యాణోత్సవం, మధ్యాహ్నం నుంచి నగరంలో టీటీడీ వేదిక్ యూనివర్శిటీ ప్రొఫెసర్ రాజేష్ భట్టర్ పర్యవేక్షణలో శ్రీరామ మహా శోభాయాత్ర నిర్వహించాలని తలపెట్టామన్నారు. వారం రోజుల్లో తదుపరి కార్యక్రమాలు ప్రకటిస్తామన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, వైఎస్ఆర్ ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయిదత్త పేర్కొన్నారు. నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా, విద్యా దీవెన, వసతి దీవెన ఇవ్వలేదని ఆరోపించారు. యాజమాన్యాల ఒత్తిడితో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం, యాజమాన్యాల వద్ద ఏడు లక్షల విద్యార్థులు సర్టిఫికెట్లు ఉంచారన్నారు. అడ్మిషన్, పరీక్షల సమయంలో ఎలాంటి ఇబ్బందులు పెట్టకూడదనే స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో కళాశాలల యజమానులు ఫీజులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు. డిసెంబర్ 30న విజయవాడలోని ధర్నా చౌక్ నందు జరిగే పోరు దీక్షకు విద్యార్థులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మామిళ్లబాబు, గంగా సురేష్, అకీరానంద్, శివ తేజ, చంద్ర, అశోక్, అరుణ్, వెంకట్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

జన వికాస్ సేవా సమితి సేవలు ప్రశంసనీయం



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నగర ప్రముఖులు

కడప కోటిరెడ్డిసర్కిల్: జన వికాస్ సేవా సమితి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. కడప కోఆపరేటివ్ కాలనీలోని ఖాసింఖాన్ ఆడిట్ కార్యాలయంలో సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను అతిథులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ సేవా సమితి తాహిర్ సేవ్ గర్ల్ చైల్డ్ అనే నినాదంతో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించడాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో తన కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. అనంతరం నగరానికి చెందిన ఆడిటర్ ఖాసింఖాన్, ఆడిటర్ల సంఘం రాష్ట్ర నాయకుడు షరీఫ్ ఖాన్, కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ సేవలందించే అవకాశం చాలామందికి ఉన్నా వివిధ కారణాలతో ముందుకు రాలేకపోతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర ఉపాధ్యక్షుడు మీనూర్ అలీఖాన్, షైక్ అలీ షేర్, నూనె నగేష్, డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్.నాసర్ అలీ, అబ్దుల్ వాజీద్, మస్తాన్ వల్లి, వల్లెపు శివ, డాక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తా



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంక్షేమ సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్: పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. కడప నగర శివారులోని పద్మశాలీ భవన్ నందు ఆదివారం సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రముఖ వైద్యులు డా.సామా బాలసుబ్రహ్మణ్యం, డా.సామా సుధ దంపతులు, డా.అవ్వారు అర్జున్, డా.మామిళ్ల మల్లికార్జున, డా.మామిళ్ల సునీల్ కుమార్ సంఘం నూతన సంవత్సర కాలెండర్లను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆపై జరిగిన ఉచిత పరిణయ వేదిక కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోము జ్ఞానశంకర్, ప్రధాన కార్యదర్శి డా.చుప్పల విజయకుమార్, డా.మామిళ్ల వెంకటసుబ్బయ్య, బోడిచెర్ల సుబ్బరాయుడు, సుబ్బరాయుడు, వద్ది మాధవ, విజయలక్ష్మి, సాధు శివ, వద్ది చైతన్య, కృష్ణయ్య, పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోకపోవడం దారుణం

కడప వైఎస్ఆర్ సర్కిల్: అమిత్‌షాపై ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా చర్యలు తీసుకోకపోవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో సోమవారం జరిగే ఆందోళనకు జనం హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు సిద్ధపడకపోవడం తగదన్నారు. డిసెంబరు 30న జాతీయ నిరసన దినం పాటించాలని వామ పక్షాలు సంయుక్తంగా ప్రకటించాయన్నారు. ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చడంలో విఫలమైన మోదీ సర్కార్ అంబానీ, ఆదానీలకు సంపద దోచిపెడుతూ కులం, మతం, ప్రాంతం పేరుతో ఆంక్షలు విధిస్తోందన్నారు. స్వతంత్ర సంస్థలైన సీబీఐ, ఈడీ సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ న్యాయవ్యవస్థను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు.

ఉద్యోగులకు పాత బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇలియాస్ బాషా

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా ఇప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత బకాయిలు చెల్లించలేదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) కడప జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ.ఇలియాస్‌బాషా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కడప నగరంలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ, ఈయల్స్, జీఎల్ఐ, పీఎఫ్ ఫైనల్ పేమెంట్స్‌తోపాటు పీఎఫ్ రుణాలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సంక్రాంతి పండగకైనా బకాయిలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు సురేష్‌బాబు మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయ పదోన్నతుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరగా పదోన్నతులు చేపట్టి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలగంగిరెడ్డి మాట్లాడుతూ 12వ పీఆర్సీ ఆలస్యం అవుతున్న కారణంగా 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, గాలి సుబ్బారాయుడు, ప్రతాపరెడ్డి, నందగోపాల్ పాల్గొన్నారు

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అమ్మవారికి అభిషేకాలు పూజలు చేశారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే సమీపంలోని వీరభద్ర స్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు.

వాణిజ్య కేంద్రం నేరాలమయం

ప్రొద్దుటూరు వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి. ఇతర జిల్లాల నుంచి బంగారు, దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు ఇక్కడికి వస్తుంటారు. ప్రొద్దుటూరులోని వ్యాపార దుకాణాలు 365 రోజులపాటు కిటకిట లాడుతుంటాయి. అలాంటి వాణిజ్య కేంద్రంలో నేరాలు, ఘోరాలు, ఇలా అనేక కేసులు భారీగా పెరిగిపోయాయి. గతేడాదితో పోలిస్తే కేసుల్లో పెరుగుదల కనిపించడం ఆందోళన కలిగించే విషయం.



వెంకటమహేశ్వరరెడ్డి హత్య కేసులో నిందితుడి అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ మురళీధర్ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలో ఇటీవల గ్యాంగ్‌ల సంస్కృతి పెరిగింది. ఏ కారణం లేకుండానే చిన్నపాటి కారణాలకు హత్యలు చేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇటీవల జరిగిన పప్పీ హత్యతో ప్రొద్దుటూరులోని ప్రజలు ఉలికిపాటుకు గురయ్యారు. గతేడాదితో పోలిస్తే ఈసారి అనేక హత్యలు, ఆత్మహత్యలు, అదృశ్యం, హత్యాయత్నం కేసులు భారీగా పెరిగాయి. 2023లో వివిధ కారణాలతో ఏడుగురు హత్యకు గురికాగా ఈ సారి పది మంది హత్యకు గురయ్యారు. గత ఏడాది 31 మోసం కేసులు నమోదు కాగా ఈ ఏడాది 33కు, హత్యాయత్నం కేసులు 16 నమోదు అయ్యాయి. స్వల్పగాయాల గొడవలు ఈ సారి భారీగా చోటు చేసుకున్నాయి.

2024లో జరిగిన వివిధ నేరాల వివరాలివీ..

నేరం	కేసుల సంఖ్య
ఆత్మహత్యలు	76
హత్యలు	10
హత్యాయత్నాలు	16
మోసం కేసులు	33
గొడవల్లో తీవ్రమైన గాయాలు	02
స్వల్పంగా గాయపడిన కేసులు	112
దోపిడీలు	01
అత్యాచారాలు	07
కిడ్నాప్‌లు	01
రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారు	12

ఈ ఏడాదిలో జరిగిన ముఖ్యమైన నేరాలు

- ప్రొద్దుటూరులో తండ్రి అన్నం పెట్టకుండా చిత్ర హింసలకు గురి చేసి కొట్టడంతో నాలుగేళ్ల ముస్తఖీమ్ అనే బాలుడు చనిపోయాడు.
- పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో ద్వార్యల వెంకట మహేశ్వరరెడ్డిని దారుణంగా హత్య చేశారు. అతడి మృతదేహాన్ని మూడు ముక్కలు చేసి పట్టణ శివారులో పడేశారు.
- ప్రొద్దుటూరుకు చెందిన ముదాఫీర్, పఠాన్ రహ్మతుల్లా, షాహిద్ అనే ముగ్గురు యువకులు దువ్వూరు మండలంలోని చల్లబసాయపల్లె వద్ద ఉన్న తెలుగుగంగ కాలువలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందారు.
- తనకు ఇష్టంలేని పెళ్లి చేసిందనే కోపంతో ప్రొద్దుటూరులోని నేతాజీ నగర్–3లో నివాసముంటున్న బాల నాగమ్మను పెట్రోల్ పోసి నిప్పంటించడంతో చనిపోయింది.
- అనంతపురం జిల్లా యాడికి గ్రామానికి కొత్తూరు కంబగిరి రాముడు పేకాడేందుకు వచ్చి ప్రొద్దుటూరు మండలం కల్లూరు శివారులోని పెన్నానది ఒడ్డున అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.
- సుందరాచార్యుల వీధిలోని లాడ్జీలో రాఘవేంద్ర కుమార్ అలియాస్ పప్పీని ముగ్గురు వ్యక్తులు మద్యం సీసాలతో కొట్టి చంపేశారు.
- శ్రీనివాసనగర్‌కు చెందిన జిలానీబాషా పట్టణంలోని శేషుగారివీధిలో ఉన్న పార్వతి ఆర్కేడ్ కాంప్లెక్స్‌లోని గదిలో బంగారు పని చేస్తుంటాడు. అతడి షాపులో ఆగస్టు 25న రాత్రి చోరీ జరిగింది. సుమారు 31 తులాలు బంగారు, రూ.50 వేలు నగదును దుండగులు దోచుకొని వెళ్లారు. అయితే నాలుగు నెలలు గడిచినా చోరీ కేసులో ఎలాంటి పురోగతి కనిపించలేదు.

నగరంలో న్యూ ఇయర్ సందడి షురూ

- హోటళ్లలో ప్రత్యేక ఆఫర్ల ప్రకటనలు
- పలు కూడళ్లలో వెలుస్తున్న ఫ్లెక్సీలు



న్యూ ఇయర్ వేడుకలు(ఫైల్)

కడప కల్చరల్: నూతన సంవత్సర వేడుకల సందడి మొదలైంది. మరో రోజు అనంతరం నూతన సంవత్సరం రానుంది గనుక యువత, బాలలు, యువతుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. నూతన సంవత్సరం ప్రారంభం నాడు ఆ ఏడాదంతా మరువలేని ఆనందాలను పంచుకోవాలని భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీనికి తగినట్లు వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు వారి ఆశల మేరకు అవసరమైన ఆహార పదార్థాలను సిద్ధ చేస్తూ ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నారు. నూతన సంవత్సర కానుకగా ధరల తగ్గింపు, తక్కువ ధరల్లోనే పలు పదార్థాలు తదితర ఆకర్షణలతో నగరంలోని ముఖ్య కూడళ్లలో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటుచేశారు.

ప్రత్యేకత కోసం ఆరాటం

రెండు బిర్యానీలకు ఒక బిర్యానీ ఫ్రీ....కేజీ స్వీట్ కొంటే అర కిలో మిక్చర్ ఉచితం.....బిర్యానీ కొంటే కూల్ డ్రింక్ ఉచితం....ఈ ఆఫర్లు భలే ఉన్నాయి కదూ....ఔను ఇవన్నీ నిజంగా నిజమే....నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ జిల్లాలోని హోటళ్లు, స్వీట్ స్టాళ్లు, బేకరీలు కొత్త ఉత్సాహంతో ప్రజలు, యువత మోజును గమనించి తమ అమ్మకాలను పెంచుకొనేందుకు ఆఫర్లు గుప్పిస్తున్నారు. వీటితో కూడిన ప్రచారాన్ని బ్యానర్లు, ఫ్లెక్సీ హోర్డింగ్‌తో కూడళ్లను నింపేశారు. ఎటుచూసినా ఆ బోర్డులే కనిపించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రచారంలో పోటీ పడుతున్నారు. దుకాణాల వద్ద కొత్త కల కనిపించేలా చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో వ్యాపారులు తమ ఆఫర్లను ప్రకటిస్తూ భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు.

ఆఫర్లు ఎన్నెన్నో...

కొన్ని హోటళ్లలో సూచించిన మొత్తం చెల్లిస్తే డిసెంబరు 31వ తేదీ రాత్రి వెజ్, నాన్‌వెజ్ పరిమితి లేకుండా తినేయవచ్చు. మరిన్ని హోటళ్లలో ముందే టేబుళ్లు బుక్ చేసుకుంటే 30–50 శాతం బిల్లులో తగ్గిస్తున్నారు. ప్రముఖ స్వీట్ దుకాణాలలో కిలో స్వీట్ కొంటే అర కిలో మిక్చర్, అర కిలో స్వీట్ కొంటే పావుకిలో మిక్చర్ ఆఫర్లు పెట్టారు. మరిన్ని చోట్ల రూ.500, రూ.700, రూ.1000కు పైగా స్వీట్లు కొంటే కూల్‌డ్రింక్ ఉచితమని ఊరిస్తున్నారు. ఇంకొన్ని హోటళ్లలో రెండు బిర్యానీలకు ఒక బిర్యానీ ఫ్రీ, బిర్యానీలకు కూల్‌డ్రింక్ ఫ్రీ అంటూ భారీగా ఆఫర్లు గుప్పించారు. ప్రత్యేకించి కొన్ని పెద్ద హోటళ్లలో 31వ తేదీ మధ్యాహ్నం నుంచి రాత్రి 12 గంటల వరకు ప్రతి వెయ్యి రూపాయలకు మించిన బిల్లుకు టోకన్ ఇచ్చి అర్ధరాత్రి నూతన సంవత్సరంలో లాటరీ తీస్తున్నారు. మొదటి మూడు బిల్లులకు మనీ బ్యాక్ ఆఫర్ చేస్తున్నారు. కూడళ్ల చుట్టూ ఈ ఫ్లెక్సీ హోర్డింగ్‌లే ఉండడంతో అటు వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ×నయాసాల్¥పై ప్రజల్లో ఉన్న ముఖ్యంగా యువతలో క్రేజ్‌ను సొమ్ము చేసుకునేందుకు వ్యాపారులు తమదైన శైలిలో ఈ ఆఫర్లను ప్రకటించడం గమనార్హం. ఈ సంవత్సరం యువత సందడి ఎక్కువగా ఉండే అవకాశాన్ని ఊహించిన పోలీసులు ఎక్కడికక్కడ వారి సందడి హద్దులు మీరకుండా, వాహనాలపైనా, ఆంక్షలు పెట్టేందుకు మరోవైపు జిల్లా పోలీసు శాఖ సిద్ధమవుతోంది.